మూడున్నరేళ్ల పాలనలో అన్ని విభాగాలలో సంస్కరణలు తీసుకువచ్చాం

- సంక్షేమ ఫలాలతోనే సమాజంలో మార్పు
- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-కవిటి : మూడున్నర ఏళ్ల పాలనలో అన్ని విభాగాలలో సంస్కరణలు తీసుకువచ్చామని రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని బల్లిపుట్టుగ జిల్లా పరిషత్ చైర్మన్ పిరియ విజయ సాయిరాజు నివాసం వద్ద వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ జగనన్న పాలనలో అర్హత ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపట్టి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేయడం జరిగిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి సంక్షేమ ఫలాలు అందజేయడంలోని సమాజంలో మార్పు తీసుకురావచ్చుని అన్నారు. 1.73 వేల కోట్ల రూపాయలు గడచిన మూడున్నరఏళ్లలో పథకాల రూపంలో పంపిణీ చేశామని తెలిపారు. భూ రికార్డులు నవీకరించకపోవడం వల్ల గ్రామాలలో కుటుంబాల మధ్య అశాంతి కొట్లాటలు నెలకొన్నాయని గుర్తు చేశారు. భూములన్న బ్యాంకుల్లో అప్పులు దొరకని పరిస్థితులు కూడా రైతులు ఎదుర్కొన్నారన్నారు. వీటన్నింటికీ చెక్ పెట్టే నిర్ణయాలు తీసుకున్నామని అన్నారు. రానున్న 15 రోజుల్లో నేడు ఉన్న 350 సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు మరో రెండు వేలు కార్యాలయాలు జోడించడం జరుగుతుందన్నారు. మరో రెండు మూడు సంవత్సరాలలో గ్రామాలలో సచివాలయాలను సబ్ రిజిస్టర్ కార్యాలయాలుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు నదీ జలాలు నీరు సరఫరా, కిడ్నీ రోగులకు పలాస కేంద్రంగా ఆసుపత్రి నిర్మాణం పనులు పూర్తి దశకు చేరుకున్నాయని అన్నారు. టెక్కలిలో మూలపేట భావనపాడు వద్ద మూడు వేల కోట్ల రూపాయలతో హార్బర్ నిర్మాణానికి వచ్చే నెలలో శంకుస్థాపన పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణ దాస్,జెడ్పి చైర్మన్ పిరియా విజయ, ఇచ్చాపురం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయ కర్త సాయిరాజ్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్,ఏపీ రాష్ట్ర గ్రీనింగ్%ఉ% బిటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామరావు, సిడాప్ చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ డైరెక్టర్ కృష్ణారావు రౌల్లో, ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్,వైస్ ఎంపీపీ పూడి నేతాజీ,జయ ప్రకాష్, రజిని కుమార్ దోలై తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీరు : స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-ఆమదాలవలస : భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా త్రాగునీరు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతోనే ప్రతి గడపకు త్రాగునీరు అందించే కార్యక్రమాన్ని జల జీవన మిషన్ ద్వారా చేపట్టారని ఆంధ్రప్రదేశ్ శాసనసభపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలంలో కోటి 39 లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన స్పీకర్ తమ్మినేని సీతారాం కలివరం పంచాయతీ పరిధిలోని కంచరపు వారి పేట గ్రామంలో సుమారు 31 లక్ష నిధులతో, ముద్దాడ పేట గ్రామంలో 60 లక్షల నిధులతో మరియు ఫీరు సాహెబ్ పేట గ్రామంలో సుమారు 48 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయి కార్యక్రమానికి శుక్రవారం స్పీకర్ తమ్మినేని సీతారాం చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, తొగరం సర్పంచ్ తమ్మినేని వాణి సీతారాం, ఎంపీపీ తమ్మినేని శారదమ్మ, వైస్ ఎంపీపీలు మానుకొండ వెంకటరమణ, సోమరాజు జగన్నాధరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుపల్లి శ్రీనివాసరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, స్థానిక సర్పంచ్ బండి ఉమ, స్థానిక నాయకులు బండి రాజులు, గురువుబెల్లి గిరి, పైడి మురళి, నాయకులు దశరథ, చల్లా సింహాచలం, కనుగుల కిషోర్, కుటికుప్పల సన్యాసిరావు, సువ్వారి అనిల్, టి రామారావు, చిలకలపల్లి సురేష్, సోమరాజు తేజ తదితర వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షులుగా పద్మరాజు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, నూతన పిసిసి అధ్యక్షులుగా గిడుగు రుద్రరాజు పద్మరాజు, ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ, ఒరిస్సా రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌కి నియమించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన ఆధ్వర్యంలో శ్రీకాకుళం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్రమశిక్షణతో పని చేస్తామని డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి తెలియజేస్తూ తమ శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రాతినిథ్యం అసెంబ్లీలో కచ్చితంగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో సనపల అన్నాజీరావు, దేశెళ్ల గోవింద మల్లిబాబు, అంబటి కృష్ణారావు, రెల్ల సురేష్, పైడి నాగభూషణ రావు, కె.వి.ఎల్. ఎస్ ఈశ్వరి, మంత్రి నరసింహమూర్తి, లఖినేన సాయిరాం, కూరాకుల వెంకటరావు, అంబటి దాలోనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ మస్తర్లలో దిద్దుబాట్లు

సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల్లో చాలావరకు మస్తర్లలో దిద్దుబాట్లు ఉన్నట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. మండలంలో 2021- 22 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి పనులపై శుక్రవారం ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో మండల స్థాయి సామాజిక తనిఖీల ప్రజా వేదిక జరిగింది ఈ ప్రజా వేదికలో గ్రామస్థాయిలో తనిఖీ బృందాలు పరిశీలించిన పలు లోపాలను వెల్లడించారు పలు గ్రామాల్లో మస్తర్లలో దిద్దుబాట్లు ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. వేతన దారులు సమయపాలన పాటించకపోవడంతోనే మస్తర్లో దిద్దుబాట్లు జరిగినట్లు ఆయా గ్రామసభల్లో వేతనదారులు పేర్కొన్నారని తనిఖీ బృందాలు వెల్లడించాయి. నిబంధన ప్రకారం ఎం బుక్ జిరాక్స్ ను పనులు చేపట్టిన మస్టర్ షీట్ కు జత చేయాల్సి ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోలేదని పనికి బృందాలు పేర్కొన్నాయి. పనులు జరిగిన చోట బోర్డులను ఏర్పాటు చేయలేదని గుర్తించామని తనిఖీ బృందాలు తెలిపాయి. భగీరథపురం తదితర గ్రామాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్ భాగంగా నాటిన మొక్కల్లో సగం కూడా లేకపోవడాన్నితనిఖీ బృందాలు రికార్డు చేశాయి. ఈ సందర్భంగా జిల్లా నీటి యాజ మాన్య సంస్థ పిడి జీవి చిట్టి రాజు మాట్లాడుతూ వేతనదారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. గరిష్టంగా 257 రూపాయలు పొందేలా పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి జడ్పిటిసి బల్లాడ హేమమాలిని, ఎంపీడీవో కుమార్ పట్నాయక్ ఏపీవో శోభా దేవి తదితరులు పాల్గొన్నారు.

బహుజన కళామండలి 25వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

పాటలతూట ఉదయ్ భాస్కర్ పిలుపు

విశాలాంధ్ర-టెక్కలి: ప్రజా చైతన్యమే ఊపిరిగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పీడిత ప్రజలకు రాజ్యాధికారమే లక్ష్యంగా తన పాటతో ముందుకు సాగుతున్న బహుజన కళామండలి 25వ వార్షికోత్సవం, విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పాటలతూట బహుజన కళా మండలి వ్యవస్థాపకులు ఆతవ ఉదయ్ భాస్కర్ పిలుపు నిచ్చారు. శుక్రవారం టెక్కలిలోని అంబేద్కర్ విగ్రహ సమీపంలో దళిత నాయకులతో కలిసి కరపత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 10న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిధులుగా డా.కత్తి పద్మారావు. ప్రజాకవి జయరాజు, సినీ గేయ రచయిత మాష్టార్జీ డా.కోయి కోటేశ్వరరావు పాల్గొంటున్నట్లు తెలిపారు. మహాసభలో అంబేద్కర్ సాంఘిక విప్లవ గీతాలు అనే పాటల పుస్తకం ఆవిష్కరిస్తున్నట్టు ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ఇండియా దళిత్ రైట్స్ పోరం జిల్లా అధ్యక్షులు కంఠ వేణు, బహుజన వాది ప్రముఖ న్యాయవాది లకినేని శ్రీనువాసరావు, సుంకు గోపినాద్, గొర్లె ప్రసాద్, చింతాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతంగా చేపట్టాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపడుతున్న నాడు నేడు పనులను వేగవంతంగా చేపట్టాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి కె.ప్రకాశరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో జరుగు తున్న నాడు-నేడు పనులు పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో మాట్లాడుతూ ప్రణాళికా బద్దంగా బోధించి మంచి ఫలితాలు దిశగా శ్రమించాలని సూచించారు. ఆయనతోపాటు ప్రిన్సిపాల్ బాడ వెంకట మోహనరావు ఉన్నారు.

మంజూరైన ఇళ్ల పట్టాలు... తహశీల్దార్ పంపిణీ..!

సమాచారమిచ్చినా రాని సర్పంచ్ : తహశీల్దార్
ప్రొటోకాల్ పాటించడంలేదంటూ కలెక్టర్‌కు సర్పంచ్ ఫిర్యాదు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : కోటబొమ్మాళి పంచాయతీలో నిరుపేదలకు జగనన్న ఇల్లు పట్టాలు మంజూరయ్యాయని, వాటిని పంపిణీ చేయాలని సర్పంచ్ కాళ్ళ సంజీవరావుకు వీఆర్వో, సూపరెండెంట్ ద్వారా సమాచారం ఇచ్చినా... వాటి పంపిణీకి సర్పంచ్ ముందుకు రాకపోవడంతో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని స్థానిక తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ శుక్రవారం తెలిపారు. కోటబొమ్మాళి పంచాయతీలో 2021 సంవత్సరం డిసెంబర్ నెలలో నిరుపేదలకు జగనన్న ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని, అయితే ఇప్పటివరకు కొంతమందికి ఇవ్వడం జరగలేదు. దీంతో ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని తెలుసుకున్న ప్రజలు ప్రతిరోజు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి మా పట్టాలు ఇవ్వాలంటూ కోరడంతో ఈ విషయం వీఆర్వోలు, సూపరెండెంట్ ద్వారా స్థానిక సర్పంచ్‌కు తెలియజేసిన ఆయన ఎందుచేతనో వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో పట్టాలు మంజూరైనవారికి మేమే అందజేయటం జరిగిందని, ఈ విషయం జరిగి ఒక సంవత్సరం అవుతుందని అమె తెలిపారు.

తహసీల్దార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి : లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాల పంపిణీలో తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ ప్రోటోకాల్ పాటించకుండా తన స్వంత నిర్ణయాలతో ముందుకు వెలుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొనే విధంగా వ్యవహరిస్తున్నందున తహశీల్దార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ కాళ్ళ సంజీవరావు, మండల పరిషత్ ఉపాధ్యాక్షుడు బోయిన నాగేశ్వరావు, పంచాయతీ వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు శుక్రవారం టెక్కలి సబ్ కలెక్టర్‌కు, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి పిర్యాదు చేశారు. కోటబొమ్మాళి గ్రామ పంచాయతీకి చెందిన ఇళ్ళ పట్టాలు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి శాసన మండలి సభ్యులు దువ్వాడ శ్రీనివాస్‌కుకాని, పంచాయతీ సర్పంచ్‌కు, వార్డ్ సభ్యులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ప్రోటోకాల్ పాటించకుండా తహసీల్దార్ తన నిర్ణయాలతో ముందుకు వెళుతుందని పిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయం ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా తెలియజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డబ్బీరు ప్రదీప్, బోయిన క్రిష్ణారావు, ఇర్రి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లక్ష్యసాధనకు కృషి చేద్దాం

వైస్ ఎంపీపీ లోతుగెడ్డ

విశాలాంధ్ర-కొత్తూరు : రానున్న ఎన్నికల్లో వైసీపీకి 175కి 175 సీట్లు సాధన దృష్టిలో అందరం కృషి చేద్దామని పాతపట్నం నియోజ. కవర్గ వైసీపీ నేత, మండల వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు అన్నారు. పార్టీ షోషల్ మిడియో విభాగం సహకారంతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు గత మూడున్నర ఏళ్లుగా సిఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ ఫలితాలు ప్రతీ కుటుంబానికి అందాయని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ అన్నారు. జనాల్లోకి వెళ్లి సీఎం జగన్మోహన్ రెడ్డి పాలన గురించి ప్రజలకు వివరించాలని ప్రతీ ఒక్క కార్యకర్త 175/ 175 సాధన దిశగా పనిచేయాలని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ సమావేశంలో నున్న వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండలంలోని పలువురు వైసీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి సమస్యలు పంచాయతీ సమస్యలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి, సంతబొమ్మాళి మండలం లక్కివలస పంచాయతీ సమస్యలు తీసుకెళ్లినట్లు, పంచాయతీ సర్పంచ్ శ్రీరంగం వీరస్వామి తీసుకెళ్లారు. ఇటీవల జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటించి నపుడు సమస్యలతో కూడిన ధరఖాస్తు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమస్యలు విన్నవించటం జరిగిందని ఆయన తెలిపారు. ఆయనతోపాటు ఎంపీటీసీ చింతల రాజులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : పట్టణంలో శుక్రవారం పర్యటించిన రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు చేసారు. జిల్లా పరిషత్ ఛైయిర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన క్రిష్ణదాస్‌లతో నియోజకవర్గ కేంద్రానికి చేరుకున్న రెవిన్యూ మంత్రికి స్థానిక ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌ల ఆధ్వర్యంలో ఆపార్టీ ముఖ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఏఐఐబి నిధులతో మున్సిపాలిటీలో నీటిసరఫరా కోసం 58.83 కోట్లతో చేపట్టబోయే సమగ్ర త్రాగునీటి సరఫరా పథకానికి, వైఎస్సార్ ప్రజా ప్రస్థాన విజయ వాటిక వద్ద రూ.75 లక్షలతో పార్క్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపనల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మూడు రాజధానులకు మద్దత్తుగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో 1.04కోట్లతో నిర్మితమైన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని, జ్ఞానభారతిలో రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ స్టూడెంట్స్ అటెండెన్స్ విధానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఛైర్మన్లు దుక్క లోకేశ్వరరావు, సాడిశ్యామ్‌ప్రసాద్, నర్తు రామారావు, పి.ఎ.సి.ఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర, నూతలపాటి బాబూరావు, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్మాణ పనులను సక్రమంగా జరగాలి

ఎంపీడీవో చంద్రకుమారి

విశాలాంధ్ర-మెళియాపుట్టి : గ్రామాలలో పారిశుధ్య నిర్మాణ పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ఎంపీడీవో చంద్ర కుమారి అన్నారు. మండల కేంద్రంలో గల స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ సర్వీసెస్ ప్రగతి, ఎస్డిజి సర్వే, పిఎంజేఏవై సర్వే, తదితర వాటితో పాటుగా ఇంటి నిర్మాణం పనులపై సమీక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు తీరు పై ఆరా తీశారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీడీవో తో పాటుగా పంచాయతీ విస్తరణధికారి తారకేశ్వరి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు నీరందించే ఘనత టీడీపీదే

విశాలాంధ్ర-పలాస : పలాస నియోజకవర్గం శివారు భూములకు వంశధార నీరు అందించే ఘనత టీడీపీదేనని టీడీపీ నాయకులు విఠల్, తమ్మినేని గంగారాం, కుత్తుమ లక్ష్మణకుమార్, దువ్వాడ సంతోష్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే శివాజీ పోరాట పటిమ వల్లే శివారు భూములకు వంశధార నీరు అందిందని, వైసీపీ మూడున్నర సంవత్సరాల్లో ఒక్క ఏడాదైనా రైతులకు సాగునీరు అందించారని ప్రశ్నించారు. గతంలో కూడా ఎగువ రైతులు అడ్డుకున్నా పలాస నియోజకవర్గం రైతులకు సాగునీరు అందించామని, వైసీపీ నాయకులకు చేతకాకపోవడం వలన పక్క నియోజకవర్గంలో ఎమ్మెల్యే అచ్చెన్నాయుడుపై నిందలు వేయడం సరికాదన్నారు. మున్సిపాలిటీ తాగునీరుపై ఇప్పటి వరకు మంత్రి ఎన్నిసార్లు సమీక్షించారో ప్రజలకు తెలియజేయాలని అన్నారు. మూడున్నరేళ్లల్లో పలాసను అవినీతికి అడ్డాగా మార్చేసిన వైసీపీ నాయకులు కింజరాపు కుటుంబం కోసం మాట్లాడే అర్హత లేదని అన్నారు. ఎం.పి రామ్మోహనాయుడు గురించి మాట్లాడే అర్హత మంత్రికి లేదని, ఎం.పి రామ్మోహనాయుడు జిల్లాకు నీట్ పరీక్ష సెంటర్, అనేక రైలు హాల్ట్‌లు సాధించారని అన్నారు. సమావేశంలో కూర్మారావు, హెూరియా మోహన రావు, ధర్మారావు, పోలయ్యలు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి చేయూత

విశాలాంధ్ర-పొందూరు : మండలం తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కొమ్మన హేమలత మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసినది. బాధిత కుటుంబం పేదవారైనందున పాఠశాల ఉపాధ్యాయ సహచర బృందాలతో పాటు విద్యార్థులు సంయుక్తంగా 55వేల రూపాయలను మొత్తాన్ని సేకరించి విద్యార్థిని కుటుంబానికి అందించారు. ముందుగా విద్యార్థిని చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు.ఈ సందర్భంగా హెచ్ఎం హేమచార్యులు మాట్లాడుతూ క్రమశిక్షణ ఉత్తమ లక్షణాలతో మెలిగే విద్యార్థిని కూల్పోవడం దురదృష్టంగా భావించారు.

27న లిఫ్ట్ ఇరిగేషన్ జనాంకితం

విశాలాంధ్ర-పొందూరు : పొందూరు మండల ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న లైదాం ఎత్తుపొతల పథకం జనాంకితం చేసేందుకు సిద్ధమైందని పొందూరు మండల వైయస్సాఆర్ సిపి అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్ వెల్లడించారు. మండలం లైధామ్ గ్రామంలో జడ్పిటిసి లోలుగు కాంతారావు, ఎంపీపీ ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావులతో కూడిన నేతల బృందం లిఫ్ట్ ఇరిగేషన్ పరిశీలించారు. ప్రియతమ రాష్ట్ర శాసనసభాపతి తమ్మినేని సీతారాం చొరవతో సరళ వేగంగా పనులు చేయిస్తూ, ఆదివారం స్పీకర్ చేతులమీదుగా జనాంకితం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎత్తిపోతల పథకం ఇనగ్రేషన్ కార్యక్రమానికి మండల వైయస్సార్సీపి పార్టీ నేతలు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు, అభిమానులు, పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి సీతారాములు, ఎంపీటీసీ ప్రతినిధి బొడ్డేపల్లి ప్రసాదరావు, జి కృష్ణ, గ్రామ సచివాలయ ఉద్యోగులు, పలువురు వైసీపీ నేతలు వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయం : మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రంలో ఏర్పడ్డ పరిస్థితులను, ఇప్పట్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వై.సి.పి చేపడుతున్న చర్యలను ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని రాష్ట్ర రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనల్లో భాగంగా శుక్రవారం పర్యటించిన ఆయన వైఎస్ఆర్ ప్రజాప్రస్థానం విజయస్థూపం వద్ద ఏర్పాటు చేసి బహిరంగ సభలో పాల్గొని రాష్ట్రంలో మూడు రాజధానుల ఆవశ్యకతను వివరించారు. మున్సిపల్ ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన మూడు రాజధానులకు మద్దతుగా నిర్వహించిన సభనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని పారద్రోలడానికి విశాఖలో పరిపాలన రాజధాని అవశ్యమన్నారు. రాష్ట్రంలో ప్రతీ ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి పరిచే ధ్యేయంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాజధానికి ఉండాల్సిన అన్నిరకాల సదుపాయాలు విశాఖపట్టణానికి ఉన్నాయని, పరిపాలనా రాజధానిగా ప్రపంచ పటంలో నిలిచిపోతుందని, ఈ ప్రాంత వాసుల సమస్యల పరిష్కారాలు కూడా త్వరగా జరుగుతాయని, అభివృద్ధి ఊపందుకుంటుందని, ఉత్తరాంధ్ర వివిధ రకాల వ్యాపారాలు వృద్ధి చెందుతాయని వివరించారు. జిల్లా పరిషత్ ఛైయిర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతు దగ్గర్లోనే రాజధాని ఉండటం వల్ల మూడు గంటల వ్యవధిలోనే రాజధానికి చేరుకుని పనులు చెక్కబెట్టుకోవచ్చని, ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందకూడదనే అశూయతో ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన క్రిష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.

తిలక్‌ను పరామర్శించిన కృష్ణదాస్

విశాలాంధ్ర-నందిగాం: రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ తల్లి పేరాడ సత్యమమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాసు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యవతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కోత మురళి, సువారి గాంధీ, ధవళ రమేష్, పొలాకి ఎంపీపీ ముద్దాడ బైరాగి నాయుడు, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణ రావు, మాజీ ఎంపీపీ చక్రవర్తి, చింతాడ గణపతి, మండలంలోని పలువురు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సైన్స్ కాంప్లెక్స్‌పై అవగాహన అవసరం

డిప్యూటీ డీఈఓ తిరుమల చైతన్య



విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సైన్స్ కాంప్లెక్స్‌పై అవగాహన అవసరమని, డెప్యూటీ డీఈఓ తిరుమల చైతన్య అన్నారు. శుక్రవారం సంతబొమ్మాళి ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బరాటం కామరాజు, ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి మండలంలో కనీసం 2500 కుటుంబాలకు ఉపాధి చూపించాలి

డ్వామా పీడీ జీవి చిట్టి రాజు

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్: జిల్లాలోని అన్ని మండలాల్లోనూ కనీస స్థాయిలో రోజుకు 2500 కుటుంబాలకు ఉపాధిని కల్పించాలని, అందుకు అవసరమైన మేర క్షేత్రస్థాయిలో జాబ్ కార్డుదారులను సమాయత్తం చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవి చిట్టి రాజు క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాలు సిబ్బందికి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. పనికి వచ్చిన వారు అందరికీ సగటువేతనం రూ 250 తక్కువ కాకుండా సిబ్బంది మార్కింగ్ ఇచ్చి పనులు చేపట్టాలని అన్నారు. 75% జాబ్ కార్డుదారుల కుటుంబాలు వంద రోజులు పనులు పూర్తి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. 80% జాబ్ కార్డ్ దారుల కుటుంబాలు 80 రోజులు సగటు పని దినాలు పనులకు వచ్చేలా చూడాలన్నారు. పై లక్ష్యాలను చేరుకొని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో పట్టుబడ్డ రెండు ఇసుక వాహనాలు

విశాలాంధ్ర-పొందూరు: స్థానిక స్టేషన్ అండ్ ఫోర్స్ మెంట్ బ్యూరో దాడుల్లో శుక్రవారం రెండు ఇసుక వాహనాలు పట్టుబడ్డాయి. ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఉదయం ఎస్ఇబి సిఐ శ్రీనివాస్ సిబ్బందితో దాడి చేసి జి సిగడాం మండలం కొల్లివలస వద్ద లారీని సర్వేశ్వరపురం సమీపంలో ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. కేసు నమోదుచేసి వాహనాలను వాహన సిబ్బందిని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

కళింగ కోమట్ల సంఘానికి స్థలం కేటాయిస్తాం

వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-సరసన్నపేట: నియోజకవర్గంలోని కళింగ కోమట్ల సంఘానికి స్థలం కేటాయిస్తామని వైసిపి, జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కళింగ కోమట్లతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, కృష్ణదాస్ మాట్లాడుతూ పట్టణంలో మెజార్టీ స్థాయిలో వున్న కళింగ కోమట్లు తమకు సహకరించాలని, గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని పథకాలు సిఎం, జగన్మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు అందిస్తున్నారని తెలిపారు. మీకు నిత్యం అండదండగా వుండే నన్ను మీరు సహకరించాలని, తప్పకుండా త్వరలో మీ కులానికి భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని కృష్ణదాస్ హామీ ఇచ్చారని కళింగ కోమట్ల సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళింగ కోమట్ల కార్పొరేషన్ ఛైర్మన్, అంధవరపు సూరిబాబు, ఎంపిటిసి, వైశ్యరాజు కేశవరాజు, సంఘ ప్రతినిధులు, కెసిహెచ్‌బి.గుప్తా, తంగుడు జోగారావు, పొట్నూరు సాయిప్రసాద్, తంగుడు గిరిధరుడు, బోయిన బాలకృష్ణ, గుడ్ల రమేష్, పొట్నూరు పృథ్వీ, వూణ్ణ సంతోష్, టంకాల రాష్మి, పొట్నూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 52ను తక్షణమే రద్దు చేయాలి

విశాలాంధ్ర-పలాస : జీవో నెం.52 తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని ఆదివాసీ రోడ్లు ఎక్కారు. ఆదివాసీ నాయకులు చలో పలాస కార్యక్రమానికి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పలాసలో ఆదివాసీలు జీవో నెం.52 రద్దు చేయాలని ర్యాలీ చేపట్టారు. అనంతరం మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కార్యాలయం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ ఆదివాసీలకు నష్టపరిచే జీవో 52ను రద్దు చేయాలని, ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సవర జగన్నాయకులు, సవర ధర్మారావులు పాల్గొన్నారు.

పార్లమెంట్ మార్చ్‌లో జిల్లా నాయకులు

రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలు ప్రత్యేక హోదా, నిరుద్యోగ సమస్యలు తదితర డిమాండ్ల మీద దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం చేపట్టిన పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొన్న జిల్లాకు చెందిన ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. యుగంధర్, జిల్లా కార్యదర్శి, అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, వై.మురళీ, ఏఐఎస్ఎఫ్ నాయకులు సీహెచ్. రవి తదితరులు

మంత్రి, జాఫర్‌ను సన్మానించిన సర్పంచ్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం భావనపాడు పంచాయతీ సర్పంచ్ బుడ్డ మోహన్ రెడ్డి, వార్డు సభ్యులు, పెద్దలు రాష్ట్ర పశుసంవర్ధక, మత్యశాఖా మంత్రి సీదిరి అప్పలరాజు, ఎలక్ట్రానిక్ మీడియా జాఫర్‌లను కలిసి సన్మానించారు. ఈమేరకు పంచాయతీ సమస్యలు మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరినట్లు సర్పంచ్ మోహన్‌రెడ్డి తెలిపారు.

ఆలోచనా ధోరణి మారాలి

చైర్ పర్సన్ హేమమాలిని రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాకుళం: సమాజంలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమేనని,ఈ విషయంలో ప్రజల ఆలోచన ధోరణి మారాలని మహిళా ఆర్థిక సంస్థ చైర్ పర్సన్ బళ్లాడ హేమమాలిని రెడ్డి పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న హింస, వివక్ష, లైంగిక వేధింపుల నివారణపై సమన్వయ సమావేశం, అవగాహన కార్యక్రమం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు పనిచేస్తున్నారని, ఈ సమయంలో లైంగిక వేధింపులకు, వివక్షకు గురైతే చట్టాలను వినియోగించుకోవాలని కోరారు. ఇటువంటి వాటి నుండి తమకు తాము రక్షించుకునేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను అమలుచేస్తున్నాయని, ఈ చట్టాల పట్ల మహిళలు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మహిళలు పనిచేసే ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో స్థానిక ఫిర్యాదుల కమిటీ తప్పక ఏర్పాటు చేయాలని, అందులో మహిళలతో పాటు పురుషులకు అవకాశం కల్పించాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై కమిటీ కఠినంగా శిక్షించాలని, అపుడే మహిళలకు పూర్తిరక్షణ లభిస్తుందని పిలుపునిచ్చారు. ఈ చట్టంపట్ల జిల్లా, మండల, గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని ఆమె కోరారు.

జిల్లా రెవిన్యూ అధికారి ఎం.రాజేశ్వరి మాట్లాడుతూ మహిళలు బాధ్యతగా వ్యవహరిస్తూ, సున్నితమైన అంశాలపై దృష్టి సారించలేకపోతున్నారని అన్నారు. మహిళా చట్టాలపట్ల గ్రామ సచివాలయ స్థాయి వరకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ సదస్సులో బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ యు.శ్రీలక్ష్మి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి ఆర్.వెంకటరామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డా. డి.వి.విద్యాసాగర్, సమగ్ర శిశు సంరక్షణ పథక సంచాలకులు కె.వి.రమణ, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖాధికారి కె.అనంత లక్ష్మి, జిల్లా బి.సి.సంక్షేమ శాఖాధికారి ఆర్.గడ్డెమ్మ, దిశ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.లలిత, మహిళా మార్గదర్శి,పారా(ఎన్.జి.ఓ)జిల్లా సమన్వయ కర్తలు ఎ.ఎస్.లక్ష్మీకుమారి,ఎల్.సంపత్ కుమారి, సిడిపిఓలు డి.రాధామాధవి, జి.శోభారాణి, ఇతర అధికారులు, అంగన్వాడి కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

- రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించి... ప్రమాదాలు నివారణకు చర్యలు చేపట్టాలి
- నేర సమీక్ష సమావేశంలో అధికారులుకు దిశ నిర్దేశాలు
- ఎస్పీ జి.ఆర్.రాధిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ప్రమాదాలు నివారణకు రహదారులపై ప్రతి రోజు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహించి, రోడ్డు భద్రత నియమాలపై వాహన చోదకులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని పోలీసు అధికారులుకు జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అక్టోబర్ నెలకు సంబంధించిన కేసులుపై జిల్లా ఎస్పీ జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశాని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్లతో అనుసంధానమయ్యే జాతీయ రహదారి విస్తరణ, తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలపై ఆరా తీసి, ప్రమాదలు నివారణకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. ఇందులో భాగంగా ప్రతిరోజు సాయంత్రం ఐదు ఎనిమిది గంటల మధ్య కాలంలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి, మైనర్లు, రెష్ అండ్ నెగెలిజెన్సీ డ్రైవింగ్ నియంత్రించాలని, హెల్మెట్ ధరించక, ట్రిబుల్ డ్రైవింగ్ చేసేవారిపై జరిమానాలు విధించాలని పేర్కొన్నారు. రహదారిపై ఇరువైపులా నో పార్కింగ్, ఇసుక డ్రమ్స్, ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రహదారి భద్రత నియమాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి ప్రమాదలు నివారణకు ప్రేత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కేసు ధర్యాప్తుల్లో నాణ్యత ఉండాలని స్టేషన్‌కు వచ్చు ప్రజలు, భాదితులపట్ల స్నేహ భావంతో మాట్లాడాలని, సహనం చాలా అవసరం పేర్కొన్నారు. కేసుల ధర్యాప్తుల్లో కేసు వివరాలు సీసీటీఎన్ఎస్ నమోదు చేయాలని సూచించారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ జరిపి అదృశ్యమైన వారిని త్వరగా ఆచూకీ తెలుసుకోవాలన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి నిరంతరం తనిఖీలు చేయాలని ఆదేశించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం పోలీసు శాఖకు అందించిన 'దిశ' ప్రత్యేక వాహనాలను సమర్ధవంతంగా వినియో గించుకుని మహిళలపై నేరాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈవ్ టీజర్లపైన, తాగుబోతులు, అనుమానాస్పదంగా మహిళలను అనుసరించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.శ్రీనివాసరావు, డీఎస్పీలు ఎం. మహేంద్ర,ఎం.శివారామి రెడ్డి, ఎస్. వాసుదేవ్, సి.హెచ్.జి.వి, ప్రసాద్, జి. శ్రీనివాసరావు,బి. విజయకుమార్, ఎస్. బాలరాజు, సి.ఐలు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

పొగమంచుతో వాణిజ్య పంటలకు అపార నష్టం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : గడిచిన మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న పొగమంచు వల్ల వాణిజ్య పంటలైన ఉల్లి, మిరప, కంది, చిక్కుడు, బీర, బెండ తదితర పంటలు సాగుచేసే రైతులు విపరీతంగా నష్టపోతున్నారు. రాత్రంతా కురుస్తున్న పొగమంచువల్ల ఈ పంటలు పాడవ్వటంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు. మండలంలో జర్జంగి, శ్రీజగన్నాథపురం, చీపుర్లపాడు, నారాయణవలస, సొదాం, రేగులపాడు, యలమంచిలి, చిన్నసాన, కన్నేవలస, పెద్దబమ్మిడి, హరిశ్చంద్రపురం, దుప్పిలపాడు, నీలంపేట, కొత్తపల్లి జియ్యన్నపేట, తర్లిపేట తదితర పంచాయతీల్లో ఉల్లి, మిరప తదితర పంటలు విస్తరంగా వేశారు. ఈ పొగమంచుకి పేను వ్యాధి వ్యాప్తిచెందడంతో ముడత తెగుళ్ళు వచ్చి సమూలంగా నాశనమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిల్లో ఉద్యానవన శాఖాధికారులు అందుబాటులో ఉండి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

వణికిస్తున్న చలి పులి : గత రెండు రోజులుగా మండలంలో చలి పులి ప్రజలను, వృద్ధులను, చిన్నారులను వణికిస్తుంది. ఉదయం 7 గంటల వరకు ఏవరూ బయటకు రాలేకుండా ఒకవైపు చలి, మరోవైపు పొగమంచు అలుముకోవడంతో ప్రజలు జలుబు, న్యూమోనియా వంటి వ్యాదులకు గురవుతున్నారు. అలాగే సాయంత్రం 5 గంటల నుండే చలి విపరీతంగా పెరగడంతో రాత్రి వేళ బయటకు రాలేని పరిస్థితి. ఈ చలిపులి ఇంకా ఏన్నాళ్ళు ఉంటుందోనని ప్రజలు అందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడినందున చలి ఎక్కువగా ఉందని, అలాగే ఎండకాలంలో కూడా యేడాది ఎండలు కూడా ఎక్కువగానే ఉంటాయని పలువురు భావిస్తున్నారు.

చురుకుదనంతో పిల్లలను ఉత్తేజితం చేయాలి : ఎంఈఓ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : విద్యార్థులను సులభంగా ఆటపాటలతో చురుకుదనంతో ఉత్తేజితం చేయాలని స్థానిక మండల విద్యాశాఖాధికారి గోవిందరావు అన్నారు. జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో గల నాలుగు రోజులుగా జరుగుతున్న సరియైన స్థాయిబోధన శిక్షణ కార్యక్రమంలో ఆయన శుక్రవారం ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. గణితంలో పిల్లలకు ఏ విధంగా అసక్తి పెంచవచ్చు, తమాషా గణితం, ఉత్తేజంలను ఎంఈఓ తన ఆటపాటలతో ఉపాధ్యాయులను ఉత్తేజపరిచారు. అలాగే రిసోర్స్ పర్సన్‌లు షన్ముఖరావు, శ్రీనివాసరావులు ఆటపాట జోడించి కృత్యాధార పద్దతులతో పిల్లలకు ఎలా బోధించి కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించాలో తెలియజేశారు. పిల్లలను వారి స్థాయికి తగ్గట్టు అభ్యసన సామర్థ్యాలు సాధించటం ఉపాధ్యాయుల బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పైడి పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ కేంద్రం నిర్మాణంపై హైకోర్టు స్టేటస్కో

విశాలాంధ్ర-పొందూరు : మండలం గోకర్ణ పల్లి గ్రామంలో సర్వేనెంబర్ 96 – 24 లో నిర్మిస్తున్న వేల్ నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రానికి నిర్మాణాలపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం స్టేటస్కో ఇచ్చినట్లు మాజీ ఎంపీటీసీ సిపాన శ్రీ రంగనాయకులు తెలిపారు. ఈ సర్వేలో రాళ్లగుట్ట భూమిని మండల రెవెన్యూ అధికారులువెల్ నెస్ కేంద్రం, రైతుబరోస కేంద్రాల నిర్మాణానికి అప్పగించారు. దీనిపై కొంతమంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు భవనాల నిర్మాణం నిలిపివేయాలంటూ స్టెటస్కో ఇచ్చారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ 2వ వార్డు పరిధి పురుషోత్తపురంలో పేద కుటుంభీకురాలు నెయ్యిల లక్ష్మి అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న ఆ వార్డు కౌన్సిలర్ చాట్ల పుష్ప ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేసారు. బాదిత కుటుంభాన్ని పరామర్శించి 20వేల రూపాయలను అందజేసారు. అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, చాట్ల తిరుపతి, సచివాలయ కార్యదర్శి సుజిత్‌కుమార్, ఆర్పీ ఈశ్వరి, సుగ్గు కామరాజు, శాంతి తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలు తప్పనిసరి

మేజరు పంచాయతీ సర్పంచ్ సంజీవరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్నభోజన పథకంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన జగనన్నగోరుముద్ద పథకంలో మెను ప్రకారం తప్పకుండా పెట్టాల్సిందేనని కోట బొమ్మాళి మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు అన్నారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెను ప్రకారం రుచికరంగా విద్యార్థులకు వండి పెట్టాలని వంటనిర్వాహకులకు సూచించారు. వంట నిర్వాహకులకు ఏదైన సమస్య ఉంటే తనకు తెలిజేయాలికాని విద్యార్థులకు మాత్రం మెను ప్రకారం వంటను వండి వడ్డించాలన్నారు. ఇప్పటికే చాలా పాఠశాలల్లో వంటనిర్వాహకులు వంటలు రుచికరంగా వండకపోవడంతో వారిపై చర్యలు తీసుకోవాడం జరిగిందని, అంతవరకు తీసుకురాకుండా చూడాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో ఎలాంటి ఇబ్బంది ఉన్న తమకు తెలియజేయాలని సర్పంచ్ విద్యార్థులను సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పైడి పోలినాయుడు, పట్టణ అధ్యక్షులు డబ్బిరు. ప్రదీప్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇక్రి చిరంజీవి, రిటైర్డ్ ఈవో లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈనెల 28న మూడు వాహనాలు వేలం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : వివిధ కేసులలో పట్టుబడి పోలీస్ స్టేషన్‌లోఉన్న మూడు వాహనాలను ఈనెల 28వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహించటం జరుగుతుందని అసక్తి గలవారు పాల్గొనాలని స్థానిక ఎస్ఐ షేక్ ఖాదర్ భాషా శనివారం తెలిపారు. అక్రమ మద్యం రవాణలో భాగంగా ఒక టీవీఎస్, రెండు స్కూటీలను పట్టుకొని సీజ్ చేయటం జరిగిందని, పై అధికారులు అదేశాలు మేరకు వాటిని 28తేది సోమవారం వేలం పాట నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలిపారు.

వెంకయ్య పేటలో బాదుడే బాదుడు

విశాలాంధ్ర-ఆమదాలవలస: రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనకు నిరసనగా టిడిపి శ్రేణులు శుక్రవారం సాయంత్రం వెంకయ్యపేటలో వాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు జిల్లా టిడిపి పార్లమెంటరీ అధ్యక్షులు కూన రవికుమార్ ఆధ్వర్యంలో ఆమదాలవలస మున్సిపాలిటీలోని వెంకయ్యపేట గ్రామంలో బాదుడే బాదుడు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో నేటి ప్రభుత్వంలో ప్రజలపై పడుతున్న భారాన్ని వ్యత్యాసం చూపుతూ బాదుడే బాదుడు కార్యక్రమం తొ ఇంటింటికి వివరించారు. ఈ కార్యక్ర మంలో పట్టణ టిడిపి అధ్యక్షులు బోర గోవింద రావు, జిల్లా టిడిపి మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తమ్మినేని గీత విద్యాసాగర్, టిడిపి నాయకులు సిమ్మ మాధవి, ఎమ్.చంద్ర హర్ష, ఏ భాస్కరరావు, యు అనంతరావు, రామారావు, సింహాసనం, లోకేశ్వరరావు, రవి, ఎండ అప్పలనాయుడు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'అరవ' కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సీఎం జగన్‌కు అరవ కులస్థుల వినతి

విశాలాంధ్ర - నరసన్నపేట : రాష్ట్రంలో సుమారు 5వేల కుటుంబాలు కల్గిన అరవ కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, మమ్మల్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలని పోతయ్యవలస, మాజీ ఎంపిటిసి, కనపల శేఖర్‌రావు అన్నారు. ఈ విషయమై గత బుధవారం నరసన్నపేట పర్యటనకు వచ్చిన సి.ఎం, జగన్మోహన్‌రెడ్డికి, శేఖర్‌రావు వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సంధర్భంగా శేఖర్‌రావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాలతో పాటు రాష్ట్రంలో పలు చోట్ల అరవ కులస్థులు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో 56కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసిన ప్రభుత్వం తమ అరవ కులానికి కార్పొరేషన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో పొందర, కూరాకుల కార్పొరేషన్‌లో చేర్చి, మాకు న్యాయం చేయాలని అభ్యర్ధన చేశారు. ఈ విషయమై పరిశీలిస్తామని సిఎం తెలిపారని శేఖర్‌రావు అన్నారు.

పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించండి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, నవంబర్ 26వ తేదీన (శనివారం) "భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం" నవంబర్ 28వ తేదీ (సోమవారం) "మహాత్మా జ్యోతి రావు పూలే వర్ధంతి"ల సందర్భంగా ఆయా నియోజకవర్గ కేంద్రంలో రెండు కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించాలని, అదేవిధంగా "మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి" కార్యక్రమం తేది 28న (సోమవారం) ఉదయం 10గంటలకు స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాల యం శ్రీకాకుళంలో జరగనుందని, కావున ఈ కార్యక్రమానికి జిల్లా కమిటీ కార్యవర్గం, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్స్, పార్టీలో వివిధ స్థాయిలలో ఉన్న సభ్యులు, కార్యకర్తలు పాల్గొనాలని, జిల్లా వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్ శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా కోరారు.

రైతులకు మద్దతు ధర కల్పించాలి

- ప్రతి గింజా సేకరించాలి
- పౌర సరఫరాల కమీషనర్ హెచ్.అరుణ్ కుమార్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలో ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లలో రైతులకు సరైన గిట్టుబాటు ధరను కల్పించాలని పౌర సరఫరాల కమీషనర్ హెచ్.అరుణ్ కుమార్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సంయుక్త కలెక్టర్‌తో కలిసి ధాన్యం సేకరణపై పౌర సరఫరాల అధికారులు, సంబంధిత అధికారులతో కమీషనర్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని, బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలని, గోనె సంచులు త్వరగా అందించాలని మిల్లర్లను ఆదేశించారు. రైతులకు అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని, అలాగే మద్దతు ధర వచ్చేలా చూడాలన్నారు. రైతుల నుండి ప్రతి గింజ సేకరించాలని, పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవలసినదిగా ఆదేశించిన్నారు. సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లాలో 371 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయన్నారు. ఇప్పటికే కొన్ని ప్రారంభించడం జరిగిందని, ధాన్యం కొనుగోలులో రైతులకు సరియైన గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు కమీషనర్‌కు వివరించారు. రైతులకు అవసరమైన గోనె సంచులు, హమాలీలు, రవాణా పక్కాగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వి.రమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీధర్, జిల్లా సహకార అధికారి, రైస్ మిల్లర్లు అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ హాస్టల్స్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలని వినతి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలోని బాలుర బాలికల హాస్టల్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలని విద్యార్థులు ప్రొఫెసర్ సిహెచ్ఎ రాజేంద్రప్రసాద్‌ను శుక్రవారం కలిసి విన్నవించారు. వసతి గృహాల్లో గదులు సరిపోవటం లేదని బెడ్ల సంఖ్యను పెంచాలని విద్యార్థులు కోరారు. భోజనం నాణ్యత పెంచాలని కూడా విద్యార్థులు కోరారు. భోజనం ప్లేట్లను కొనుగోలు చేసి అందజేయాలన్నారు. దీనిపై రిజిస్టర్ స్పందిస్తూ హాస్టల్ అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నిధుల మంజూరుపై కృతజ్ఞతలు

విశాలాంధ్ర -మెళియాపుట్టి: పాతపట్నం నియోజకవర్గంలో ప్రజల త్రాగునీటి అవసరాలపై నిధులు మంజూరు చేయటం పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మండల వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వారంతా సమావేశమై ఎమ్మెల్యే రెడ్డి శాంతి అభ్యర్ధన మేరకు త్రాగునీటికై 265 కోట్లు నిధులు మంజూరుచేసి నియోజకవర్గ అభివృద్ధికై ప్రభుత్వం వరాలు జల్లు కురిపించిందని స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, మండల వైఎస్ఆర్సీపీ పార్టీ అధ్యక్షులు పల్లి యోగిలు ఒక ప్రకటనలో తెలియజేస్తూ ఉద్దానం మంచినీటి ప్రాజెక్టుకు అనుసంధానం చేసేలా పాతపట్నం నియోజక వర్గంలో పాతపట్నం, హిరమండలం, మెళియాపుట్టి మండలాలకు పుష్కలంగా త్రాగునీరు అందించే ఉద్దేశంతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పలుమార్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విన్నవించుకున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్పందించి 265 కోట్ల త్రాగునీటి సమస్య తీర్చే విధంగా నిధులు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు మండల ప్రజలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు ఈ సమావేశంలో వారితో పాటుగా జెడ్పీటీసీ గూడ ఎండయ్య, సర్పంచ్లు, ప్రజా పతినిధులు తదితరులున్నారు.

వైసీపీతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-మందస : వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఉద్దాన ప్రాంతాభివృద్ధి చెందిందని గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఉద్దాన అభివృద్ధి చెందక నిర్లక్ష్యానికి గురైందని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం మండలం బాహడపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమం అభివృద్ధి పనులు ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య, జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, తహశీల్దార్ బి.పాపారావు, ఎంపిడివో వాయిలపల్లి తిరుమలరావు, సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటికి సర్కారు ప్రాధాన్యత

విశాలాంధ్ర-పొందూరు : జనావళికి అత్యంత ప్రాధాన్యం కల్పించే దశగా సర్కారు వ్యవసాయ సాగునీటినీ, తాగునీటినీ కల్పిస్తుందనిరాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. మండలం ధర్మపురం గ్రామంలో సర్పంచ్ ఎం పాపి నాయుడు అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశంలో పాల్గొని పైవిధంగా అన్నారు. రాష్ట్రంలో రైతు రాజ్యం స్థాపన దశగా రైతు క్షేమమే సర్కారు ధ్యేయంగా పనిచేస్తుంద న్నారు. రైతు కంట కష్టాలను రైతు కన్నీటి లేని రాష్ట్రంగా చేసేందుకు బృహోత్తరమైన పథకాలు ప్రవేశపెట్టిన ఘనత జగనన్నదేనన్నారు. రైతు బ్రతుకులకు బంగారు బాట వేసే దశగా సాగునీరు అందించేందుకు నీటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. మండలంలో ఏడు కోట్లతో నిర్మించిన లైదాం ఎత్తు పోతల పథకం ఈనెల 27వ తేదీన ప్రారంభించడం జరుగుతుందన్నారు. అనంతరం ధర్మపురంలో గడపగడపకు కార్యక్రమం చేపట్టారు. ఇంటింటా సమస్యలు విపులంగా తెలుసుకున్నారు. ధర్మపురంలో ప్రజలు తమ్మినేనికి ప్రతి చోట ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, జడ్పిటిసి లోలుగు కాంతారావు,ఏఎంసీ చైర్మన్ బాడన సునీల్, పొందూరు పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు, సూర్యారావు,జరజాపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వన్ టు వన్‌లో పాల్గొన్న 'బగ్గు'

నియోజకవర్గ పరిణామాలపై చర్చించిన 'చంద్రబాబు'

విశాలాంధ్ర-నరసన్నపేట : మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంఛార్జ్, బగ్గు రమణమూర్తి జాతీయ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు నిర్వహించిన వన్ టు వన్ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సంధర్భంగా నరసన్నపేట నియోజక వర్గంలో గత మూడున్నర సంవత్సరాల నుండి జరుగుతున్న వైసిపి నాయకుల అవినీతి, అక్రమాలు, నియోజక వర్గంలో జరుగుతున్న స్థలాల కబ్జాలు, ప్రభుత్వం ప్రజలపట్ల అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై చర్చించటం జరిగిందని మాజీ ఎమ్మెల్యే, రమణ మూర్తి తెలిపారు. అలాగే నియోజకవర్గంలో రమణ మూర్తి పనితీరుపై సంతృప్తి తెలుపుతూ, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని చంద్రబాబు సూచించారని ఆయన అన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు మంత్రి ధర్మాన ప్రారంభం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని శిలగాం గ్రామపంచాయతీలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని శిలగాం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 21.80 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రము, 40 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం,నాబార్డ్ నిధుల నుండి 26.50 లక్షల రూపాయల నిధులతో పశువైద్య కేంద్రంను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణ దాస్,జెడ్పి చైర్మన్ పిరియా విజయా సాయిరాజ్,రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, ఏపీ రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామరావు, చైర్మన్ శ్యామ్ ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ పిలక రాజ్యలక్ష్మి, లజపతి రాయ్, డాక్టర్ దానేటి శ్రీధర్, ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ డైరెక్టర్ కృష్ణారావు రౌల్లో సోంపేట ఎంపీపీ డాక్టర్ ఎన్.దాసు, వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, వైయస్సార్సీపి ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమూల్య కొత్త వరి వంగడంతో అధిక దిగుబడి

నవయుగ సీడ్స్ ఆర్.ఎం. మహీంద్రా రెడ్డి

విశాలాంధ్ర-కొత్తూరు : నవయుగ సీడ్స్ కంపెనీ కొత్తగా ప్రవేశపెట్టిన అమూల్య వరి వంగడంతో అధిక దిగుబడులు రైతులు సాధించవచ్చని, నవయుగ సీడ్స్ కంపెనీ ఆర్. ఎం. మహీంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఇక్కడ విజయ లక్ష్మి రైతు డిపో ఆధ్వర్యంలో జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ చీడ పీడలకు, దోమ పోటు రోగాలకు తట్టుకొనే విధంగా శాస్త్రీయ పద్దతిలో అమూల్య వరి వంగడాన్ని రూపొందించినట్లు ఆర్.ఎం. మహీంద్ర రెడ్డి తెలిపారు. వరి నారు వేసిన ఇరవై నుండి ఇరవై ఐదు రోజుల్లో వరి నాట్లు వేస్తే ఎకరా పొలానికి 40 బస్తాలు దిగుబడి తప్పకుండా వస్తుందని అన్నారు. వ్యవసాయ పెట్టుబడులు బాగా తగ్గుతాయన్నారు. సాధారణ వరి కంకులకు 230 నుండి 240 గింజలు వస్తే ఆముల్యా వంగడానికి 300 వందల గింజలుంటాయని అన్నారు. 120రోజుల్లో పంటచేతికి వస్తుందన్నారు. అదేవిధంగా తమ నవయుగ నుండి మార్కెట్ లో ఉన్న పత్తి, మొక్కజొన్న విత్తనాలు ప్రత్యేక తను వివరించారు. అంతకు ముందు ఆముల్యా వరి విత్తనాలు వేసిన కర్లెమ్మ రైతుల పంట పొలాలను రైతులతో వెళ్లి నవయుగ సీడ్స్ ఆర్ ఎం మహేంద్ర రెడ్డి స్థానిక రైతు డిపో నిర్వహికులు ఎద్దు దాసు నాయుడులు రైతు సంఘ నాయకులు లోతుగెడ్డ రవికుమార్, పలువురు రైతులు పరిశీలించారు.

ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : చదువుతోపాటు ఆరోగ్యం పట్ల కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వర్‌రావు అన్నారు. గురు, శుక్రవారాల్లో జెమ్స్ ఆసుపత్రి సారధ్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గైనిక్, సైక్రియాటిస్టు, ఈఎన్‌టి తదితర విభాగాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్య నిపుణులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పి ముకుందరావు, జి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణాంశాలు సద్వినియోగం చేయాలి

విశాలాంధ్ర -కవిటి : నాలుగు రోజులు టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ శిక్షణలో నేర్చుకున్న అంశాలు పాఠశాల స్థాయిలో అమలు చేసి ఫలితాలు నమోదు చేయాలని మండల విద్యాశాఖ అధికారి శ్రీధనుంజయ మజ్జి అన్నారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనం నందు ఉపాధ్యాయ శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులకు విద్యా బోధనలో పలు సూచనలు చేశారు. టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ ప్రారంభ పరీక్ష కనుగుణంగా విద్యార్థుల స్థాయిని గుర్తించి, అందుకు అనుగుణంగా తెలుగు, గణితం బోధన చేయాలని, అందరు విద్యార్థులు చక్కగా విద్యలో ముందడుగు వేయాలని డిఆర్పిలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్పిలు జుదిష్టి రోలో, జగదీశ్వరరావు, తులసి దాస్, సరస్వతి మండల సీనియర్ ఉపాధ్యాయులు కేశవ పురియా, బల్లెడ లక్ష్మణమూర్తి, రవి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-కవిటి : మంత్రి ధర్మాన ప్రసాదరావు కు జడ్పీ చైర్పర్సన్ దంపతులు పిరియా విజయ, ఇచ్ఛాపురం నియోజకవర్గం వైయస్సార్సీపి సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ పూలగుచ్ఛాన్ని తమ స్వగృహానికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ మేరకు శుక్రవారం ఇచ్ఛాపురం నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తూ మూడు రాజధానులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించి బల్లిపుట్టుగ చేరుకున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు పిరియా కుటుంబ సభ్యులు ఘనంగా ఆహ్వానం పలికారు.

ఐతమ్‌లో ఎంబిఎ విద్యార్థులకు సదస్సు



విశాలాంధ్ర-టెక్కలి : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విద్యార్థులకు డిజిటల్ అండ్ సోషల్ మీడియా మార్కెటింగ్ కాలేజ్ అనే అంశంపై వారం రోజుల పాటు నిర్వహించిన సదస్సు నేటితో ముగిసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. బెంగుళూరుకు చెందిన 'ఈ' మార్కెటింగ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ సిఇఈ రంజన్ జనా పాల్గొని డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, చర్చ్ ఇన్జిన్ ఆప్టిమైజింగ్, పే పర్ క్లిక్ అనే అంశాలపై విద్యార్థులకు క్షున్నంగా వివరించారు. ఆయా రంగాల్లో ఉద్యోగ, ఉన్నత విద్యావకాశాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఇటువంటి సదస్సుల వల్ల నేటి పోటీ ప్రపంచంలో జరుగుతున్న మార్పులు ఎప్పటికపుడు తెలుసుకొనే అవకాశం విద్యార్థులకు కలుగుతాయని డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వి. నాగేశ్వరరావు అభిప్రాయ పడ్డారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఎంబిఎ హెచ్ఒడి డాక్టర్ కె.వేణుగోపాల్, ఫ్యాకల్టీ డాక్టర్ చింతామణి ప్రసాద్ పట్నాయిక్, 42 మంది విద్యార్థులు పాల్గొన్నారు.